



పిల్లర్ల దశలోనే నర్సింగ్ కాలేజీ హాస్టల్ భవనాలు

నిధుల కోసం నిరీక్షణ

మెడికల్, నర్సింగ్ కాలేజీ భవనాల నిర్మాణంలో జాప్యం

రూ.80 కోట్ల మెడికల్ కాలేజీ పనులకు రూ.35 కోట్ల చెల్లింపు

నర్సింగ్ కాలేజీకి రూ.10 కోట్ల పనులకు పైసా రాలేదు

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి జిల్లాలో నత్తనడకన పనులు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి సంగారెడ్డి, మే 17 : సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ భవనాల నిర్మాణం కోసం నిధులను నిరీక్షించాల్సి వస్తున్నది. నిధుల విడుదలలో జాప్యం కారణంగా భవనాల నిర్మాణం కుంటుపడింది. పూర్తిచేసిన పనులకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో మిగిలిన పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు. భవనాల నిర్మాణ బాధ్యతలను చేపట్టిన ప్రభుత్వ ఏజెన్సీలు చేసేదేమీలేక మౌనంగా ఉండాల్సి వస్తున్నది. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సొంత జిల్లాలో ఈ పరిస్థితులు ఉండడం గమనార్హం.

సగమైనా చెల్లించలేదు

మెడికల్ కాలేజీ రెండో విడత భవన నిర్మాణ పనులకు ప్రభుత్వం రూ.143 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో రెండంతస్తుల మెయిన్ బ్లాక్, ఆరంతస్తుల బాలుర హాస్టల్, ఎనిమిదంతస్తుల బాలికల హాస్టల్ నిర్మాణాలను చేపట్టడం జరిగింది. వీటితోపాటు స్టాఫ్‌క్వార్టర్స్ నిర్మాణం, పీజీ విద్యార్థుల క్వార్టర్స్, కిచెన్ అండ్ డైనింగ్‌హాల్స్, మార్చురీ భవనాలను చేపట్టాలని నిర్మాణ ఏజెన్సీతో ఆర్‌అండ్‌బీ శాఖ ఒప్పందం కుదుర్చుకున్నది. ఒప్పందం ప్రకారం గతేడాది నవంబరులోనే ఆయా భవనాల నిర్మాణాలను కాంట్రాక్టర్ పూర్తిచేయాల్సి ఉన్నది. నిధుల విడుదలలో జాప్యం కారణంగా పనులను పూర్తిచేయించడంలో శ్రద్ధ చూపడంలేదు. ఇప్పటివరకు రూ.80 కోట్ల పనులు పూర్తయితే ప్రభుత్వం రూ.35 కోట్లే విడుదల చేసింది. మిగతా నిధులు ఎప్పుడొస్తాయోనని కాంట్రాక్టర్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో, పనులు పూర్తవడానికి మరో రెండు, మూడు నెలలైనా పట్టవచ్చని తెలుస్తున్నది.

మొదటి విడత పనులదీ అదే గతి!

మెడికల్ కాలేజీ నిర్మాణం మొదటి విడతలో భాగంగా రెండంతస్తుల ప్రధాన భవనానికి రూ.30 కోట్లను ప్రభుత్వం ఏడాది క్రితం మంజూరు చేసింది. ఈ భవనంలో ఎంబీబీఎస్ తరగతులు కొనసాగుతున్నాయి. ఇందు సబంధించి ప్రభుత్వం ఇంకా రూ.6 కోట్లు విడుదల చేయాల్సి ఉన్నది. నిధుల విడుదలలో ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యం వల్లే మిగిలిన నిర్మాణాలకు కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదని తెలుస్తున్నది.

నర్సింగ్ కాలేజీకి నిధులు నిల్

సంగారెడ్డి-రాజంపేట రోడ్డులో నర్సింగ్ కాలేజీ, హాస్టల్ భవన నిర్మాణాలను ప్రభుత్వం చేపట్టింది. రెండంతస్తుల నర్సింగ్ కాలేజీ భవనం, రెండంతస్తుల హాస్టల్ భవన నిర్మాణాలకు ప్రభుత్వం గతేడాది రూ.34 కోట్లు మంజూరు చేసింది. నిర్మాణ బాధ్యతలను ప్రభుత్వ ఏజెన్సీ అయిన టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ చేపట్టింది. పనులు చేసేందుకు కాంట్రాక్టర్‌ను ఎంపిక చేసుకొని ఒప్పందం చేసుకున్నది. ఈ ఒప్పందం ప్రకారం నర్సింగ్ కాలేజీ, హాస్టల్ భవన నిర్మాణాలను వచ్చే అక్టోబరు లోపు పూర్తిచేసి అప్పగించాలి. గతేడాది జూలైలోనే నిర్మాణాలను ప్రారంభించిన కాంట్రాక్టర్ రూ.10 కోట్ల పనులను పూర్తిచేశారు. కానీ, ఇప్పటివరకు ప్రభుత్వం నయాపైసా విడుదల చేయలేదు. దీంతో మిగిలిన నిర్మాణాలను ఎలా చేపట్టాలని కాంట్రాక్టర్ ప్రశ్నిస్తున్నారు. అధికారులు రేపో.. మాపో నిధులు వస్తాయంటూ కాంట్రాక్టర్‌కు నచ్చచెబుతూ పనులను కొనసాగించాలని కోరుతున్నారు. ఈమేరకు కాంట్రాక్టర్ నిదానంగా పనులను కొనసాగిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి చొరవ తీసుకుని ప్రభుత్వం నుంచి నిధులను విడుదల చేయిస్తే తప్ప పనులు పూర్తయ్యేలా కనిపించడం లేదు.



నత్తనడకన సాగుతున్న మెడికల్ కాలేజీ భవన నిర్మాణ పనులు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

24 నుంచి ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ

- మెదక్ జిల్లాలో 22 కేంద్రాలు, 6,110 మంది విద్యార్థులు
- పకడ్బందీగా ఏర్పాట్లు : అదనపు కలెక్టర్

మెదక్ అర్బన్, మే 17: ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. ఈ నెల 24 నుంచి జరగనున్న సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల కోసం జిల్లావ్యాప్తంగా 22 కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 3,812 మంది, ద్వితీయ సంవత్సరంలో 2,298 మంది పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు 22 మంది సీఎస్, 22 డీవోలతోపాటు ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ టీం, 4 సిట్టింగ్ స్క్వాడ్, 4 కస్టోడియన్ బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రశ్న పత్రాల స్టోరేజికి 13 పాయింట్లు ఏర్పాటు చేశామని వివరించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీకెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఇంటర్ నోడల్ అధికారి సత్యనారాయణ, డీఎస్పీ రాజేష్, ఆర్టీసీ డీఎం సుధ, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

మెదక్ చర్చిలో హైకోర్టు జడ్జి ప్రార్థనలు



మెదక్ చర్చిలో హైకోర్టు జడ్జి సామ్‌కోషి

మెదక్ కల్చరల్, మే 17: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ చర్చిని శుక్రవారం హైకోర్టు జడ్జి సామ్‌కోషి సందర్శించారు. ఆయనకు చర్చి కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. వీరికి మతగురువు రిచర్డ్ చర్చి కట్టడం ప్రత్యేకతను వివరించారు. అనంతరం మతగురువులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఆశీర్వదించారు. వీరితోపాటు సీనియర్ సివిల్ జడ్జి జితేందర్, సంపత్, సువన్ దగ్గస్త, శాంసన్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించిన అదనపు ఎన్నికల కమిషనర్



భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు ఎన్నికల కమిషనర్, కలెక్టర్, ఎస్పీ

పటాన్‌చెరు రూరల్, మే 17 : జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను భద్రపర్చిన గీతం యూనివర్సిటీని శుక్రవారం రాష్ట్ర అదనపు ఎన్నికల కమిషనర్ లోకేష్‌కుమార్, జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి, ఎస్పీ చెన్నూరి రూపేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు స్ట్రాంగ్‌రూమ్ వద్ద కేంద్ర బలగాలు, రాష్ట్ర సాయుధ బలగాలు మరియు జిల్లా సివిల్ పోలీసులతో మూడంచెల పటిష్ఠ భద్రత ఏర్పాట్లను పరిశీలించి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఈసీ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎలాంటి అవకతవకలకు తావులేకుండా భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిజేశారు. కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ ఈవీఎంలు ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు అదనంగా ఇనుప గ్రిల్స్‌తో పాటు జనరేటర్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్పీ చెన్నూరి రూపేష్ మాట్లాడుతూ జూన్ 4వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపు వరకు గీతం యునివర్సిటీ స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సంజీవరావ్, ట్రెయినీ ఐఏఎస్ మనోజ్, కామారెడ్డి ట్రెయినీ ఐపీఎస్ కాజల్‌సింగ్, పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, నారాయణఖేడ్ డీఎస్పీ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడ్ల నిల్వకు జాగా ఏది?

- రైస్‌మిల్లుల్లో పేరుకుపోయిన ధాన్యం
- యాసంగిలో 1.90 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ
- ఇకపై సేకరించిన వడ్లు ఇతర జిల్లాలకు
- అనుమతి ఇచ్చిన పౌరసరఫరాల కమిషనరేట్
- సిద్దిపేట, మహబూబ్‌నగర్ జిల్లాలకు తరలించేందుకు గ్రీన్‌సిగ్నల్



కొల్చారంలో ఓ రైస్‌మిల్లులో నిల్వచేసిన వడ్ల బస్తాలు

మెదక్, మే 17 : అకాల వర్షాలకు రైతులకు కంటిమీద కునుకులేకండా పోయింది. ధాన్యం దిగుబడులు భారీగా పెరుగుతున్నా పంట విక్రయించే సమయానికి అగచాట్లు పడాల్సివస్తున్నది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరిస్తున్నప్పటికీ.. దిగుబడికి, రైస్‌మిల్లుల సామర్థ్యానికి పొంతన ఉండడంలేదు. మిల్లుల్లో ధాన్యం నిల్వ చేయడానికి స్థలం లేకపోవడంతో తూకం వేయడంలో జాప్యం జరుగుతున్నది. అనేక మిల్లుల్లో గత సీజన్ ధాన్యాన్నే ఇంకా మర ఆడించపోవడంతో నిల్వలు పేరుకుపోయాయి. దీంతో, ప్రస్తుతం ధాన్యం సేకరణ, తరలింపునకు తీవ్ర ఆటంకం ఏర్పడుతున్నది. వర్షాలకు కేంద్రాల వద్ద నిల్వచేసిన ధాన్యం తడుస్తున్నది. తడిసిన వడ్లు కొనుగోలు చేసేందుకు నిర్వాహకులు నిరాకరిస్తున్నారని రైతులు వాపోతున్నారు.

సేకరణ లక్ష్యం 4.20 లక్షల మెట్రిక్ టన్నులు

జిల్లావ్యాప్తంగా 28,500 మంది రైతుల నుంచి 4,20,200 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లాలో దాదాపు లక్ష మెట్రిక్‌టన్నుల సన్నరకం వడ్లు ఉత్పత్తి చేశారని అధికారులు అంచనా వేస్తున్నారు. సన్నరకం వడ్లకు ప్రభుత్వ మద్దతు ధర కంటే వ్యాపారులు ఎక్కువ ధర చెల్లిస్తుండడంతో కొనుగోలు కేంద్రాలకు తీసుకురావడానికి రైతులు ముందుకు రావడం లేదు. మిగిలిన 3.20 దొడ్డురకం వడ్లలో ఇప్పటికే 1.90 లక్షల మెట్రిక్ టన్నులు రైతుల నుంచి సేకరించారు.

సామర్థ్యం పరిమితం

ప్రస్తుతం మెదక్ జిల్లాలో 34 పారాబాయిల్డ్ రైస్ మిల్లులు, 17 సాధారణ రైస్‌మిల్లులకు కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని కేటాయిస్తున్నారు. ఆయా మిల్లుల్లో ఇప్పటికే ధాన్యం నిల్వలు సామర్థ్యానికి మించి నిండిపోయాయి. మిల్లులకు కేటాయించింది పోనూ మిగిలిన 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇంటర్మీడియట్ గోదాముల్లో నిల్వ చేశారు. వర్షాలకు ధాన్యంలో తేమ శాతం పెరగడంతో నిల్వ ఉంచితే రంగుమారే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

పొరుగు జిల్లాలకు తరలింపు

ఇకపై జిల్లాలో రైతుల నుంచి సేకరించే ధాన్యాన్ని ఇతర జిల్లాలకు కేటాయించడానికి పౌరసరఫరాల శాఖ కమిషనరేట్ కార్యాలయం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు జిల్లా సివిల్‌సప్లై మేనేజర్ హరికృష్ణ తెలిపారు. సిద్దిపేట జిల్లాలోని 20 రైస్‌మిల్లులకు 40 వేల మెట్రిక్‌టన్నులు, మహబూబ్‌నగర్ జిల్లాలోని 16 మిల్లులకు 10వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కేటాయించేందుకు అనుమతులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ మరో లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సర్దుబాటు చేయాల్సి ఉంటుంది.



సిమెంట్ లైనింగ్ పూర్తయిన నల్లవాగు ప్రాజెక్టు కాల్వలో పారుతున్న నీరు

చకచకా..

- చురుగ్గా నల్లవాగు ప్రాజెక్టు కాల్వల ఆధునీకరణ
- సిమెంట్ లైనింగ్‌తో 3-4 టీఎంసీల నీరు ఆదా
- 13 గ్రామాలకు ప్రయోజనం.. చివరి ఆయకట్టుకు మహర్దశ

7లో

జోరుగా ఇసుక దందా



7

నల్లవాగులో ఇసుక ఫిల్టర్

- నక్కవాగులో విచ్చలవిడిగా ప్లాంట్లు
- మట్టిని కడిగి నాసిరకం ఇసుక తయారు
- నది ఇసుకలో కలిపి పట్టణాల్లో విక్రయం
- సామాన్యుల జీవితాలతో చెలగాటం

యువకుడి దహన సంస్కారాలను అడ్డుకున్న పోలీసులు

- ఆత్మహత్య చేసుకున్నందున పోస్టుమార్టం తప్పనిసరని నచ్చజెప్పడంతో ఒప్పుకున్న కుటుంబసభ్యులు

7లో



ఆత్మహత్య చేసుకున్న యువకుడి దహన సంస్కారాలను నిలిపివేసి చితిపై నుంచి మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు

కొనుగోళ్లలో నిర్లక్ష్యం.. అన్నదాత ఆగ్రహం

అకాల వర్షానికి తడిసిన ధాన్యం ● తూకంలో ఆలస్యమే కారణమని రైతుల ఆగ్రహం ● తడిసిన వడ్లు కొనాలని ఆందోళనలు



పాపన్నపేట మండలం మిన్పూర్‌లో మొలకలు వచ్చిన వడ్లను చూపుతున్న రైతులు

పాపన్నపేట, మే 17: ధాన్యం రవాణాలో జాప్యాన్ని నిరసిస్తూ మిన్పూర్ గ్రామస్థులు చేపట్టిన ధర్నా ఉద్రిక్తతలకు దారితీసింది. తహసీల్దార్ నిర్లక్ష్యపు వ్యాఖ్యలతో రైతులు కోపోద్రిక్తులయ్యారు. చివరకు తహసీల్దార్ దిగివచ్చి రైతులకు క్షమాపణ చెప్పడంతో శాంతించి ఆందోళన విరమించారు. పాపన్నపేట మండల పరిధిలోని మిన్పూర్‌లో వారం రోజులు ధాన్యం సేకరణ నిలిచిపోయింది. తూకం వేసిన వడ్ల సంచులను మిల్లులకు తరలించకపోవడంతో కొనుగోళ్లు నిలిపివేశారు. దీంతో వేల క్వింటాళ్ల ధాన్యం కల్లాల్లోనే ఉండిపోయింది. గురువారం రాత్రి కురిసిన వర్షానికి వడ్లు తడిసి మొలకలు వచ్చాయి. దీనిపై రైతులు అధికారులకు ఫోన్‌లో మొరపెట్టుకున్నారు. అయినా స్పందించకపోవడంతో మెదక్-బొడ్మట్‌పల్లి రహదారిపై మొలకొచ్చి వడ్లను గుమ్మరించి ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు నచ్చజెప్పినా రైతులు వినలేదు. రెండు గంటలపాటు ఆందోళన కొనసాగడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. డిగ్రీ పరీక్షలకు వెళ్తున్న విద్యార్థులు, ఆసుపత్రులకు వెళ్తున్నవారు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. దీంతో ఎస్సై సురేష్ ఫోన్‌లో తహసీల్దార్‌తో మాట్లాడారు. తహసీల్దార్ దురుసుగా 'మాకు పెళ్లాం పిల్లలు ఉండరా.. ఎప్పుడు పడితే అప్పుడు రావడానికి..' అంటూ సమాధానమిచ్చారు. దీంతో రైతులు కోపోద్రిక్తులయ్యారు. రైతులు కుటుంబాలను వదిలేసి కేంద్రాల వద్ద పడిగాపులు పడితే తహసీల్దార్ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికంగా ఉండకుండా.. సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అయనపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళనను ఉధృతం చేశారు. వందలాది మంది రైతులు చేరుకుంటుండంతో పరిస్థితి అదుపుతప్పే ప్రమాదం ఉందని గ్రహించి పోలీసులు తహసీల్దార్‌కు వివరించారు. దీంతో ఆయన రైతల వద్దకు వచ్చి క్షమాపణ చెప్పారు. గంటలో ధాన్యం తరలింపు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. దీంతో, రైతుల ఆందోళన విరమించారు. రైతుల ధర్నాకు మిన్పూర్ గ్రామానికి చెందిన అన్ని పార్టీల నాయకులు మద్దతు పలికారు.

రామాయంపేటలో..

రామాయంపేట : ఆరుగాలం కష్టపడి పండించిన పంట తడుస్తున్నా కొనుగోలు కేంద్రాల్లో తూకం వేయడం లేదంటూ రామాయంపేటలో అన్నదాతలు రోడ్డెక్కారు. వర్షాలకు ధాన్యం తడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ రామాయంపేట-దౌల్తాబాద్ చౌరస్తాలో రాస్తారోకో చేపట్టారు. వరి కోతలు పూర్తయి వడ్లు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి తూకం వేయించినా మిల్లులకు తరలించకపోవడంతో వర్షానికి తడిసిపోయాయని ఆరోపించారు. రైతుల ఆందోళనతో సిద్దిపేట, రామాయంపేట, దౌల్తాబాద్ మార్గాల్లో పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. పోలీసులు చేరుకుని రైతులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.



రామాయంపేటలో రాస్తారోకో చేస్తున్న రైతులు

'గడ్డపోతారంలో బోగస్ ఓట్లను తొలగించాలి'

జిన్నారం, మే 17: సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారంలో బోగస్ ఓట్లను తొలగించాలని స్థానికులు తహసీల్దార్ భిక్షపతికి శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. గడ్డపోతారం మాజీ వార్డు సభ్యులు వీరేశంగౌడ్, నాయకులు నాగరాజు, బాలయ్య, ప్రదీప్‌రాజు తదితరులు బోగస్ ఓట్లు తొలగించాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల ఓటరు లిస్టులో స్థానికేతరుల పేర్లు చేర్చారని, కొందరు ఏపీలో ఓటు వేశారని, మరి కొందరి పేర్లు రెండు చోట్లా ఉన్నాయని తెలిపారు. కాగా అర్హులైన కొందరు ఓటర్ల పేర్లు పక్క గ్రామాల్లో నమోదయ్యాయని చెప్పారు. వీటిపై విచారణ జరిపి అనర్హత గల వారిని జాబితా నుంచి తొలగించాని తహసీల్దార్‌ను కోరారు.

స్కూళ్ల ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేయాలి

- ధరణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి
- నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి

మెదక్ అర్బన్, మే 17: పాఠశాలల ప్రారంభానికి ముందే ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టిన మౌలిక వసతుల కల్పన పనులు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా కలెక్టర్లకు సూచించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. బడుల ప్రారంభానికి మరో 20 రోజుల గడువు మాత్రమే ఉందని, ఆలోగా మంజూరు చేసిన అభివృద్ధి పనులు తప్పనిసరిగా పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థుల యూనిఫాం జిల్లాలకు చేరుతున్నాయని, ఇప్పటి వరకు 17 జిల్లాలకు బట్ట చేరిందన్నారు. ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారమే లక్ష్యంగా మార్చి 15 నుంచి ప్రత్యేక డ్రైవ్ చేపట్టి లక్షా 15వేల దరఖాస్తులను పరిష్కరించామని, మే చివరి నాటి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. డిసెంబరు 8న ప్రజావాణి ప్రారంభంకాగా, ఎన్నికల నేపథ్యంలో కార్యక్రమాన్ని నిలిపివేశామని, జూన్ 7వరకు పెండింగ్ అర్జీలను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని కలెక్టర్లకు సీఎస్ సూచించారు. నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. రికార్డు స్థాయిలో 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, మరో 15 లక్షల మెట్రిక్ టన్నుల మేర కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. లోక్‌సభ ఎన్నికల పోలింగ్ విజయవంతంగా నిర్వహించడంలో కలెక్టర్లు, ఉన్నతాధికారులు, సిబ్బంది పోషించిన పాత్రను సీఎస్ అభినందించారు. సమావేశంలో మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, అధికారులు

సీఆర్పీలకు టీఏ చెల్లించాలి



సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీఆర్పీలు

సంగారెడ్డి అర్బన్, మే 17: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఎన్నికల విధులకు సంబంధించి ఉద్యోగులకు ఆర్డర్స్ పంపిణీ చేసినందుకుగాను విద్యాశాఖలో భాగమైన క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్(సీఆర్పీ)కు టీఏ చెల్లించాలని ఆ సంఘం నాయకులు కోరారు. శుక్రవారం సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఆర్పీల సంఘం జిల్లా అధ్యక్షుడు మరెల్లి దత్తు మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ పార్లమెంట్ ఎన్నికల్లో సీఆర్పీలు పనిచేశారని, వారి సేవలను గుర్తించి టీఏ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో జేఏసీ జిల్లా అధ్యక్షుడు శేషాద్రి, నాయకులు రమేశ్ తదితరులు ఉన్నారు.















నర్సంపల్లిలో పెద్దమ్మతల్లి జాతర

తూప్రాన్, మే 17: మెదక్ జిల్లా తూప్రాన్ మండలం నర్సంపల్లి గ్రామంలో పెద్దమ్మతల్లి జాతర ఘనంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం పెద్దమ్మతల్లి ఆలయం వద్ద ఉదయం నుంచే పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం పెద్దమ్మ తల్లి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. పూజారులు దత్తుశర్మ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచు కత్తుల సత్యనారాయణ, జింక మల్లేశం, చింతల రాజులు, చింతల చంద్రం, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. శనివారం బోనాలు సమర్పించనున్నట్లు వారు వివరించారు.



తూప్రాన్ మండలం నర్సంపల్లిలో పెద్దమ్మతల్లి జాతర సందర్భంగా పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం



మారెపల్లిలోని లక్ష్మీనారాయణ ఆలయం వద్ద యాగశాలలో హోమంలో పాల్గొన్న భక్తులు

మారెపల్లిలో లక్ష్మీనారాయణ ఆలయ బ్రహ్మోత్సవాలు

కొండాపూర్: సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మారెపల్లిలోని లక్ష్మీనారాయణ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో మూడవ రోజైన శుక్రవారం ఉత్సవ మూర్తుల గిరి ప్రదిక్షణ, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం భక్తులు తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. సాయంత్రం భక్తులు స్వామివారికి తులాభారాన్ని సమర్పించి మొక్కులు చెల్లించకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, భజన, సంకీర్తనలతో ఆలయా ప్రాంగణమంతా మారుమోగింది. ఆలయానికి వచ్చిన భక్తులకు కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలను కొనసాగించారు.

వంగిన స్తంభం.. పట్టించుకోని అధికారులు

ఝరాసంగం, మే 17: మండల పరిధిలోని బోరెగావ్ గ్రామంలో ఇళ్ల పక్కన ఏర్పాటు చేసిన హైటెన్షన్ విద్యుత్ స్తంభం ఇళ్ల మీదకు వంగిపోయింది. ఇదే లైన్‌లో మరో 4 స్తంభాలు కూడా వంగి ప్రమాదాన్ని తలపిస్తున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు స్తంభాలు ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి ఉంది. ఈ విషయమై సంబంధిత విద్యుత్ ఏఈకి సంవత్సరం నుంచి విన్నవించుకుంటున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ప్రమాదం జరిగితే తప్ప పట్టించుకోరా అని ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలను సరి చేయాలని కోరుతున్నారు.



బోరెగావ్‌లో వంగిన స్తంభం

చాకిరిమెట్ల ఆలయంలో వేలం పాట



వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

శివ్వంపేట, మే 17: మండల పరిధిలోని చిన్నగొట్టిముక్కల గ్రామ అటవీ ప్రాంతంలో వెలిసిన చాకిరిమెట్ల ఆలయంలో శుక్రవారం దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు ఆధ్వర్యంలో కొబ్బరికాయలు, పూజా సామగ్రి విక్రయానికి బహిరంగ వేలం పాట నిర్వహించారు. రూ.12 లక్షల 60 వేలకు పాటపాడి చిన్న గొట్టిముక్కల గ్రామానికి చెందిన కర్రె మహేష్ దక్కించుకున్నారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ.. దేవాదాయ శాఖ నిర్ణయించిన ధరలకే కొబ్బరికాయలు, పూజా సామగ్రిని భక్తులకు విక్రయించాలని సూచించారు. వేలం పాటలో వచ్చిన డబ్బులను బ్యాంకులో జమ చేసి దేవాదాయ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ఆలయన అభివృద్ధికి ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆంజనేయశర్మ, ఈవో సారా శ్రీనివాస్, నారాయణరావు పాల్గొన్నారు.

ముగ్గురు పిల్లల నిబంధనను తొలగించాలి



గజ్వేల్ పట్టణంలో మాట్లాడుతున్న దేవీ రవిందర్

గజ్వేల్, మే 17: స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ముగ్గురు పిల్లల నిబంధనను తొలగించాలని రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవిందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలకు లేని ముగ్గురు పిల్లల నిబంధన మండల పరిషత్, గ్రామపంచాయతీ, జిల్లా పరిషత్‌లకు వర్తింపజేయడం సరికాదన్నారు. ఈ నిబంధనతో ప్రజా సేవ చేయాలని భావిస్తున్న అనేక మంది ఎన్నికలకు దూరం అవుతున్నారని, ఈ నిబంధనలను వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తొలగించి ప్రజా సేవ చేయాలనుకునే వారికి అవకాశాన్ని కల్పించాలని కోరారు. ముగ్గురు పిల్లల నిబంధనను తొలగించి గ్రామ స్వరాజ్య స్థాపనకు కృషిచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయనవెంట మాత్‌పల్లి తాజామాజీ సర్పంచ్ బచ్చలి మహిపాల్, మల్లమారి రవిందర్ తదితరులు ఉన్నారు.

సౌత్‌ఆఫ్రికాలో ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా అరవింద్



సౌత్ ఆఫ్రికాలోని రువాండాలో డెంటిస్ట్రీ ల్యాబ్స్ పరీక్షను పరిశీలిస్తున్న అరవింద్

సిద్దిపేట టౌన్, మే 17: సౌత్ ఆఫ్రికాలోని స్కూల్ ఆఫ్ డెంటిస్ట్రీ కాలేజ్ ఆఫ్ మెడిసిన్ అండ్ హెల్త్ సైన్స్ యూనివర్సిటీ ఆఫ్ రువాండాలో బ్యాచిలర్ ఆఫ్ డెంటల్ సర్జరీకి సంబంధించిన ఫైనల్ పరీక్షలు ఈ నెల 13న ప్రారంభమై శుక్రవారంతో ముగిశాయి. ఫైనల్ పరీక్షల నిర్వహణలో భాగంగా సిద్దిపేట పట్టణానికి చెందిన తెలంగాణా డెంటల్ ఆసుపత్రి డాక్టర్ అరవింద్ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. సమాజంలో ప్రజలకు సేవలందించి దంత వైద్యులుగా మంచి పేరు తెచ్చుకోవాలని విద్యార్థులకు ఆయన సూచించారు. పరీక్షల నిర్వహణతో పాటు క్లినికల్, ల్యాబ్స్ నిర్వహణ, మూల్యాంకనం కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుంచి పరీక్షల నిర్వహణకు వెళ్లిన డాక్టర్ అరవింద్‌ను రువాండలోని తెలుగు ప్రజలు అభినందించి, సన్మానించారు.

ఆసానికుంట కబ్జా ఫిర్యాదులపై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల విచారణ



జిన్నారం మండలం బొల్లారంలోని ఆసానికుంట వద్ద రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారుల విచారణ

జిన్నారం, మే 17: జిన్నారం మండలం బొల్లారంలోని ఆసానికుంట కబ్జాల ఫిర్యాదులపై రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు విచారణ నిర్వహించారు. శుక్రవారం తహసీల్దార్ భిక్షపతి, ఆర్‌ఐ జయప్రకాశ్, మున్సిపల్ కమిషనర్ మంగతాయరు, ఇరిగేషన్ శాఖ ఏఈ ముధుసూధన్‌రెడ్డి ఆసానికుంటను పరిశీలించారు. ఆసానికుంటకు చెందిన మూడెకరాలను ఓ వ్యక్తి కబ్జా చేసి ఇతరులకు లీజుకు ఇచ్చాడని ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కుంట స్థలం కబ్జా చేసి నిర్మాణాలు జరిపిన వాటికి ఇంటి నంబర్ లేదని, మున్సిపల్ పన్నులు కూడా చెల్లించడం లేదని తెలిపారు. కాగా ఇదివరకే అధికారులు కబ్జాదారుడికి నోటీసులు జారీ చేయగా శుక్రవారం కబ్జా ఆరోపణలపై విచారణ చేపట్టారు.

హత్యకు కారకులైన ఆరుగురి రిమాండ్

చిన్నశంకరంపేట, మే 17: మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలోని బాగిర్తిపల్లిలో వారం రోజుల క్రితం కుమారుడిని తండ్రి హత్య చేయించిన కేసులో ఆరుగురి నిందితులను శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు రామాయంపేట సీఐ వెంకటేశం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా చిన్నశంకరంపేట మండలంలోని బాగిర్తిపల్లి గ్రామానికి చెందిన రెడ్డి ముఖేష్ కుమార్ కొన్ని రోజుల నుంచి చెడు వ్యసనాలకు బానిసై ఆస్తులు విక్రయిస్తూ కుటుంబ సభ్యులను వేదిస్తున్నాడు. దీంతో విసుగుచెందిన ముఖేష్ కుమార్ తండ్రి సత్యనారాయణ పథకం ప్రకారం ఈ నెల 12న కుమారుడ్ని హత్య చేయించాడు. హత్యకు కారకులైన ఆరుగురు నిందితులు రెడ్డి సత్యనారాయణ, రెడ్డి రమేష్, రెడ్డి నాగరాజు, రెడ్డి సత్యనారాయణ, రెడ్డి నెల్లూరు, రెడ్డి నర్సింహులును శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రామాయంపేట సీఐ వెంకటేశం తెలిపారు.

జోరుగా కృత్రిమ ఇసుక దందా

● అధికారులు, ప్రజాప్రతినిధుల అండతో రెచ్చిపోతున్న దళారులు
● నక్కవాగు వ్యర్థ జలాలతో మట్టిని కడిగి నాసిరకం ఇసుక తయారీ

కంది, మే 17: సంగారెడ్డి, కంది, హత్నూర మండలాల్లో కృత్రిమ ఇసుక దందా కాసులు కురిపిస్తోంది. కంది మండలంలోని నక్కవాగు ప్రాంతంలో ఉన్న ఆరుట్ల, చిద్రుప్ప, బ్యాతోల్, బేగంపేట్, ఎర్దనూర్, సంగారెడ్డి మండల పరిధిలోని ఇస్మాయిల్‌ఖాన్‌పేట, గౌడిచర్ల, ఫసల్‌వాది, హనుమాన్‌నగర్, హత్నూర మండలంలోని చందాపూర్, పల్పనూర్, బోర్పట్ల, రెడ్డిఖానాపూర్ గ్రామాల శివార్లలో ఈ దందా విచ్చలవిడిగా సాగుతున్నది. నక్కవాగులో ప్రవహిస్తున్న పరిశ్రమల నుంచి విడుదలైన వ్యర్థ జలాలతో మట్టిని కడిగి నాసిరకం ఇసుక తయారు చేస్తున్నా ఎవరు పట్టించుకోవడం లేదు. ఇసుక దళారులు రెవెన్యూ, ఇరిగేషన్, అధికార పార్టీ ప్రజాప్రతినిధుల అండతో మట్టిని కడిగి కృత్రిమ ఇసుకను తయారు చేసి, దాన్ని నది ఇసుకలో కలిపి అమ్ముకుంటున్నారు. నక్కవాగు పరివాహక ప్రాంతాల్లోని భూముల్లో ఎక్కువగా ఇసుక పొరలు ఉండడంతో దళారులకు వరంగా మారింది.

ట్రాక్టర్‌కు రూ.5 వేలు, లారీకి రూ.35 వేలు.

కృత్రిమంగా తయారుచేసిన ఇసుకకు ఒక ట్రాక్టర్‌కు రూ.5 వేలు, లారీకి రూ.35 వేలకు స్థానికంగా ఉండే మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. బయట మార్కెట్‌లో మేలురకం నది ఇసుక ట్రాక్టర్‌కు రూ.10 వేల నుంచి రూ.15 వేలు, లారీకి రూ.90 వేల నుంచి లక్షా ఇరవై వేల రూపాయల వరకు పలుకుతున్నది. కృత్రిమ ఇసుకను లారీల్లో ఇసుక అడ్డా వద్దకు తీసుకెళ్లి నది ఇసుకలో కలిపి పట్టణాల్లో విక్రయిస్తున్నారు.



ఆరుట్ల నుంచి బ్యాతోల్‌కు మట్టిని తరలించేందుకు నక్కవాగుపై దళారులు అక్రమంగా నిర్మించిన రోడ్డు



కంది మండలం ఎర్దనూర్ శివారులో కృత్రిమ ఇసుకను తయారు చేస్తున్న దృశ్యం



బ్యాతోల్ శివారులోని ఇసుకఫిల్టర్ల వద్ద దళారులు నిల్వ చేసుకున్న కృత్రిమ ఇసుక

క్వారీని తలపిస్తున్న పంటపొలాలు

నక్కవాగు పరివాహక ప్రాంతంలోని పంటపొలాల్లో మట్టిని తవ్వి, కృత్రిమ ఇసుకను తయారు చేస్తున్నారు. పచ్చని పంటపొలాల్లో గోతులు తీస్తూ వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. వాగు పక్కనే ఉన్న భూముల్లో ఎక్కువగా ఇసుక పొరలు ఉండడంతో దళారులు రైతులకు డబ్బు ఆశచూపి పంట పొలాలను కొల్లగొడుతున్నారు. అందులో పైపొరల్లో ఉండే నల్లమట్టిని ఇటుక బట్టీలకు, ఒకటి నుంచి రెండు మీటర్ల లోతు నుంచి వచ్చే ఇసుక పొరలున్న మట్టిని కృత్రిమ ఇసుక తయారీ కోసం తరలిస్తున్నారు. దీంతో ఆ పొలాలు ఇప్పుడు క్వారీలను తలపిస్తున్నాయి. ఇలా తరలించిన మట్టిని బ్యాతోల్, ఎర్దనూర్, చిద్రుప్ప, ఆరుట్లలోని నక్కవాగు చుట్టపక్కల కుప్పలుగా పోసి నిల్వ చేసుకుంటున్నారు.

మట్టి తరలించడానికి నక్కవాగుపై రోడ్డు ఏర్పాటు

ఇటీవల ఆరుట్ల నుంచి బ్యాతోల్‌కు మట్టిని తరలించేందుకు ఏకంగా నక్కవాగుపై అక్రమంగా మొరంతో ఫార్మేషన్ రోడ్డును ఏర్పాటు చేసుకోవడం గమనార్హం. వాగు పైనుంచి రోడ్డును ఏర్పాటు చేసుకోవాలంటే అధికారుల నుంచి ఎన్నో అనుమతులు పొందాలి. కానీ మట్టి దళారులు మాత్రం ఇవేమీ పట్టించుకోకుండా రోడ్డును ఏర్పాటు చేసుకుని, రాకపోకలు సాగిస్తున్నారు.

కృత్రిమ ఇసుకతో నిర్మాణాలు ప్రమాదకరం

నాసిరకం ఇసుకతో చేపట్టిన భవన నిర్మాణాలు, సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ, మంచినీళ్ల ట్యాంకులు, వరద కాలువలు, కల్వర్టులు వెంటనే పగుళ్లు వచ్చి కూలిపోతాయని భవన నిర్మాణ రంగ నిపుణులు చెబుతున్నారు. ఇసుకను కొనే వారు ఇసుక పరీక్షలు నిర్వహించకుండా కొంటున్నారు. అసలు ఇసుక పరీక్షలు ఎలా చేస్తారో, ఎక్కడ చేస్తారో ఎవరికీ అవగాహన లేకపోవడమే దీనికి కారణం.

రాజకీయ నేత ఫోన్‌కాల్‌కు భయపడిన అధికారులు

కృత్రిమ ఇసుక తయారీపై మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు స్థానికులు సమాచారమిచ్చినా అధికారులు పెడ చెవిన పెడుతున్నారు. 22 రోజుల క్రితం ఆరుట్ల, బ్యాతోల్ శివారులో కృత్రిమ ఇసుక తరలిస్తున్న టిప్పర్లను, ట్రాక్టర్లను, హీటాచిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ సమయంలో ఓ రాజకీయ నాయకుడి ఫోన్‌కాల్‌కు భయపడి వెంటనే వాటిని వదిలేయడం చర్చనీయాంశమైంది.

కృత్రిమ ఇసుక తయారు చేస్తే కఠిన చర్యలు

వ్యవసాయ భూముల్లో మట్టిని కడిగి, కృత్రిమ ఇసుక తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇసుక తరలించే వాహనాలు, మట్టిని తవ్వే హిటాచ్ మిషన్‌లను సీజ్ చేస్తాం. ఇందుకు బాధ్యులైన వారిపై వాల్టా చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తాం.

- విజయలక్ష్మి, తహసీల్దార్, కంది

అన్నను హతమార్చిన తమ్ముడికి జీవిత ఖైదు

అల్లాదుర్గం, మే 17: డబ్బుల విషయంలో అన్నతో గొడవపడి, రాయితో దాడి చేసి హతమార్చిన తమ్ముడికి జీవిత ఖైదుతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ మెదక్ జిల్లా న్యాయాధికారి పి.లక్ష్మీశారద శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు అల్లాదుర్గం ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చిల్వర్ గ్రామానికి చెందిన నాయకుని విఠల్ తన అన్న జగన్‌తో గతేడాది తన నివాసంలోనే డబ్బుల విషయంలో గొడవపడి రాయితో దాడి చేసి దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా అప్పటి సీఐ జార్జీ నేతృత్వంలో దర్యాప్తు చేపట్టారు. అన్నను హత్య చేసినట్లు నిరూపణ కావడంతో విఠల్‌కు జిల్లా న్యాయాధికారి లక్ష్మీశారద జీవిత ఖైదుతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కారు ఢీకొని పశువుల కాపరి దుర్మరణం

కొల్చారం, మే 17: కారు ఢీకొని పశువుల కాపరి మృతిచెందిన సంఘటన మెదక్ జిల్లా కొల్చారం పోలీస్ స్టేషన్ ఎదుట శుక్రవారం జరిగింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. కొల్చారం గ్రామానికి చెందిన నిమ్మగల్ల దేవయ్య పోలీస్ స్టేషన్ సమీపంలో పశువులను మేపుతున్నాడు. పశువులు రోడ్డుకు ఆవలి వైపునకు వెళ్లడంతో దేవయ్య రోడ్డు దాటుతున్న క్రమంలో మెదక్ వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో దేవయ్య కాలు తెగిపడి, అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. క్షతగాత్రుడిని మెదక్ ఏరియా ఆసుపత్రికి ఆటోలో తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన కారు ఆపకుండా వేగంగా వెళ్లిపోయింది. సమాచారమందుకున్న కొల్చారం ఎస్‌ఐ మహ్మద్‌గౌస్ కౌడిపల్లి పోలీసులను అప్రమత్తం చేయడంతో కారును అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్‌ఐ గౌస్ తెలిపారు.

బైక్‌ను డీసీఎం ఢీకొని ఒకరు..



పాప్య (ఫైల్)

హత్నూర: బైక్‌ను డీసీఎం ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా హత్నూర మండల పరిధిలోని సిరిపురం గ్రామ శివారులో శుక్రవారం ఉదయం జరిగింది. హత్నూర ఎస్‌ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. భీమ్లా తండా పంచాయతీ పరిధిలోని పీర్యాతండాకు చెందిన పాప్య(30)ది నిరుపేద కుటుంబం. ఆయనకు భార్య, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. పాప్య ప్రతిరోజు నర్సాపూర్, జోగిపేటలో అడ్డా కూలిగా పని చేస్తుండగా అతని భార్య కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. రోజువారి మాదిరిగానే శుక్రవారం ఉదయం పని కోసం పాప్య ద్విచక్ర వాహనంపై జోగిపేట వెళ్తుండగా.. ఎదురుగా వచ్చిన డీసీఎం బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో పాప్య తలకు తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన తండావాసులు ప్రమాదానికి కారణమైన డీసీఎం వాహనాన్ని పోలీసులకు అప్పగించారు. మృతుడి భార్య సాంకి ఫిర్యాదు మేరకు శవ పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు..

ములుగు: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన సిద్దిపేట జిల్లా ములుగు మండలం వంటిమామిడిలో కూరగాయల మార్కెట్ వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. శుక్రవారం ఎస్‌ఐ విజయ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరచినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి వయస్సు 30 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు.

'కొల్లూరు ఆర్‌వోబీ పనులతో ఆర్‌అండ్‌బీ శాఖకు సంబంధం లేదు'

పటాన్‌చెరు, మే 17: సంగారెడ్డి జిల్లా రాంచంద్రాపురం మండలం కొల్లూరు ఆర్‌వోబీ పనులతో ఆర్ అండ్ బీ శాఖకు సంబంధం లేదని ఆ శాఖ రంగారెడ్డి చేవెళ్ల డివిజన్ కార్యనిర్వాహక ఇంజనీర్ బి.వెంకటేశ్వర్‌రావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 'నత్తనడకన కొల్లూరు ఆర్‌వోబీ పనులు' శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. కొల్లూరు ఆర్‌వోబీ పనులు రైల్వే శాఖ, హెచ్‌జీసీఎల్/హెచ్‌ఎండీఏ శాఖ వారే చేపడుతున్నారని తెలిపారు. ఈ పనుల పురోగతితో తమకు సంబంధం లేదని వివరించారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ


● బంగారం, వెండి, నగదు అపహరించిన దుండగులు



బీరువాలోని వస్తువులను చిందరవందరగా పడేసిన దృశ్యం

సిద్దిపేట రూరల్, మే 17: తాళం వేసి ఉన్న ఇళ్లల్లో చోరీకి పాల్పడి బంగారం, వెండి, నగదు అపహరించుకు వెళ్లిన సంఘటన సిద్దిపేట రూరల్ మండలం బచ్చాయిపల్లి గ్రామంలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. సిద్దిపేట రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మంత్రి రాజు, మంత్రి ప్రశాంత్ అన్నదమ్ములు. ఇరు కుటుంబాలు బంధువుల ఇంటిలో శుభకార్యానికి గురువారం రాత్రి పెద్ద చికోడు గ్రామానికి వెళ్లారు. శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తాళం తీసి ఉంది. రాజు ఇంట్లోని బీరువాలోని తులం బంగారు నగలు, 35 తులాల వెండి నగలు, రూ.52 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. ప్రశాంత్ ఇంట్లో రెండు తులాల బంగారం నగలు, వెండి నగలు ఎత్తికెళ్లినట్లు తెలిపారు. మంత్రి రాజు, మంత్రి ప్రశాంత్ వేర్వేరుగా సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిద్దిపేట రూరల్ పోలీసులు తెలిపారు.

15 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

గజ్వేల్, మే 17: సిద్దిపేట గజ్వేల్ మండలం అహ్మదీపూర్‌లో 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, గజ్వేల్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. అహ్మదీపూర్ గ్రామానికి చెందిన తోట ప్రవీణ్ తన ఆటోలో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నాడన్న సమాచారంతో గజ్వేల్ పోలీసులతో కలసి టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీ చేసి ఆటోతో పాటు 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ పోలీసులు తెలిపారు. సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు మాట్లాడుతూ.. గ్రామాల్లో, పట్టణాల్లో ఇసుక, పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిలువ చేసినా, తరలించినా 8712667445, 8712667446, 8712667447 నంబర్లకు సమాచారాన్ని అందజేయాలని కోరారు. వివరాలను అందించిన వారి సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.

మేనమామ మందలించడంతో అల్లుడు అదృశ్యం



ప్రసన్నకుమార్

మనోహరాబాద్, మే 17: మేనమామ మందలించడంతో అల్లుడు అదృశ్యమైన సంఘటన మెదక్ జిల్లా కూచారం గ్రామంలో జరిగింది. శుక్రవారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం కూచారం గ్రామానికి చెందిన కిష్టపురం క్రిష్ణ వద్ద తన అక్క లలితతో పాటు ఆమె మేర్సి కుమారుడు ప్రసన్నకుమార్(24) ఉంటున్నారు. పసన్నకుమార్ ఏ పని చేయకుండా ఖాళీగా తిరుగుతుండడంతో ఏదైనా పని చేసుకోవాలని గత బుధవారం మేనమామ క్రిష్ణ మందలించాడు. ఆ తర్వాత క్రిష్ణ డ్యూటీకి వెళ్లగా.. అదేరోజు సాయంత్రం ప్రసన్నకుమార్ బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం కిష్టపురం క్రిష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువతే దేశానికి సంపద

● దేశ సమగ్రత, సానుభూతి, నైతిక నాయకత్వ సూత్రాలకు కట్టుబడి ఉండాలి: జస్టిస్ ఏ.కే.మిశ్రా

పటాన్‌చెరు రూరల్, మే 17: యువతే దేశానికి సంపద అని, వారు దేశ సమగ్రత, సానుభూతి, నైతిక నాయకత్వ సూత్రాలకు కట్టుబడి ఉండాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ జస్టిస్ అరుణ్‌కుమార్ మిశ్రా అన్నారు. కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ తన రెండో పట్టాల ప్రదానోత్సవ (గ్రాడ్యుయేషన్ డే) వేడుకను శుక్రవారం గీతం హైదరాబాద్ ప్రాంగణంలోని కిన్నెర సెమినార్ హాలులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జస్టిస్ అరుణ్ కుమార్ మిశ్రా హాజరై మాట్లాడుతూ.. పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీలను అందుకుంటున్న విద్యార్థులను అభినందించారు. పబ్లిక్ పాలసీ యొక్క భవిష్యత్తును రూపొందించడంలో వారి పాత్ర, ప్రాముఖ్యతలను నొక్కి చెప్పారు. పబ్లిక్ పాలసీ ద్వారా న్యాయం, ధర్మం, ఉమ్మడి ప్రయోజనాలు కొనసాగించాలని, యువత తీసుకునే నిర్ణయాలు, వారు సమర్థించే విధానాలు, చర్యలు అసంఖ్యాక వ్యక్తుల జీవితాలపై తీవ్ర ప్రభావాలను కలిగి ఉంటాయని గుర్తుంచుకోవాలన్నారు. అందరికీ హక్కులను కల్పించడంలో భారత రాజ్యాంగం పాత్ర, వివిధ కార్యక్రమాల ద్వారా విభిన్న వ్యక్తులను భాగస్వాములను చేయడంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ వేస్తున్న ప్రయత్నాలను జస్టిస్ మిశ్రా ఉటంకించారు. అర్థవంతమైన, ఉద్దేశపూర్వక జీవితాన్ని గడపడం ద్వారా తాము పనిచేస్తున్న సంస్థ, తమ కుటుంబంతో పాటు మాతృదేశానికి కీర్తి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్ పట్టభద్రులను అభినందించి, జస్టిస్ మిశ్రాను సన్మానించారు. కౌటిల్యా డీన్ ప్రొఫెసర్ సయ్యద్ అక్బరుద్దీన్ ముఖ్య అతిథిని పరిచయం చేశారు. ఈ పట్టాల ప్రదానోత్సవంలో 25 మంది కేఎస్ పీపీ విద్యార్థులు స్నాతకోత్తర (పీజీ) డిగ్రీలను, అత్యుత్తమ ప్రతిభ కనబరచిన వారు బంగారు పతకాలను అందుకున్నారు. యనమండ్ర మల్లికార్జునరావు బంగారు పతకాన్ని ప్రణీత పుల్లమ రాజు, ప్రియా భట్కర్ సంయుక్తంగా అందుకున్నారు. అంతర మైత్రా డీన్ అవార్డును అందుకుంది. పబ్లిక్ పాలసీ మాస్టర్స్ ప్రోగ్రామ్ మొదటి ర్యాంకర్‌గా ప్రణీత పుల్లంరాజు గీతం ప్రెసిడెంట్ పేరిట నెలకొల్పిన బంగారు పతకాన్ని అందుకున్నారు. తమ పిల్లలను వృత్తినిపుణులుగా తీర్చిదిద్దినందుకు తల్లిదండ్రులు కౌటిల్యా అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.



విద్యార్థినికి పీజీ పట్టాను అందజేస్తున్న జస్టిస్ ఏ.కే.మిశ్రా

గజ్వేల్‌లో నిలిచిపోయిన యూజీడీ పనులు

● బిల్లులు రాకపోవడంతో ఆపేసిన కాంట్రాక్టర్

గజ్వేల్, మే 17: సిద్దిపేట జిల్లా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీని మురుగు రహిత మునిసిపాలిటీగా మార్చేందుకు గత ప్రభుత్వం తలపెట్టిన అంతర్గత మురుగు కాలువల నిర్మాణ పనుల కాంట్రాక్టర్ పనులను అర్థాంతరంగా నిలిపివేశాడు. మునిసిపాలిటీని అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలపడంలో భాగంగా చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమం అధికారుల నిర్లక్ష్యం, గత ప్రభుత్వ పట్టింపులేని తనంతో మధ్యలోనే ఆగిపోయింది. 2021 చివరి నాటికి పూర్తి కావాల్సిన పనులు 2024 వచ్చినా పూర్తికాకపోవడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. 2018 ఆగస్టు 1న రూ.99కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టారు. 100 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ నిర్మాణం పూర్తికాగా, మరో 40 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. గతంలో విడుదల చేసిన రూ.99కోట్లు సరిపోకపోవడం, చేసిన పనులకు సంబంధించిన నిధులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్ చేసేదేమీ లేక మధ్యంతరాన పనులను వదిలేశాడు. ఇప్పటివరకు కాలనీల్లో పూర్తిస్థాయి కనెక్షన్లు ఇవ్వకపోవడం.. మరో నెల రోజుల్లో వర్షాకాలం ముంచుకువచ్చే అవకాశాలు ఉండడంతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతేడాది లక్ష్మిప్రసన్ననగర్, సిరి ఎన్‌క్లేవ్ కాలనీలో వర్షం దాటికి మురుగు నీరు ఛంబర్ల నుంచి బయటకు వచ్చింది. దీంతో రోడ్లన్నీ దుర్గంధంతో నిండిపోయాయి. మరోసారి వర్షాలు కురిస్తే ఇదే పరిస్థితి పునరావృతమయ్యే అవకాశాలున్నాయి. మునిసిపాలిటిలో వంద కిలోమీటర్ల మేర యూజీడీ నిర్మాణం చేపట్టగా వంద కిలోమీటర్లలో 9వేల ఇళ్లకు కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. ఇప్పటివరకు కేవలం 8,700 కనెక్షన్లు మాత్రమే ఇచ్చారు. మిగిలిన కనెక్షన్లు ఇవ్వకపోవడంతో ప్రజలు కనెక్షన్లు ఎప్పుడు ఇస్తారా అని ఎదురుచూస్తున్నారు. ఈ విషయమై స్థానిక కౌన్సిలర్లు, మునిసిపల్ అధికారుల చుట్టూ తిరుగుతున్నా కాంట్రాక్టర్ పత్తా లేకుండా పోవడంతో వారు ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది.



గజ్వేల్ పట్టణంలో చేపట్టిన యూజీడీ పనులు(ఫైల్)

విలీన గ్రామాల్లో కానరాని యూజీడీ

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ పరిధిలోని విలీన గ్రామాలైన క్యాసారం, ముట్రాజ్‌పల్లి, సంగాపూర్ గ్రామాల్లో యూజీడీ అంశంపై మునిసిపల్ పాలకవర్గం రూ.40కోట్ల నిధులు కావాలని మునిసిపాలిటీలో తీర్మానం చేసి గత ప్రభుత్వానికి అంచనాను పంపించారు. ఈ క్రమంలో ఎన్నికలు రావడంతో తీర్మానాన్ని పట్టించుకోలేదు. దీంతో విలీన గ్రామాల్లో యూజీడీ నిర్మాణంపై నీలినీడలు అలుముకున్నాయి. ఇటు కాంట్రాక్టర్‌కు రావాల్సిన బిల్లులకు సంబంధించి ఎలాంటి స్పందన లేకపోవడంతో యూజీడీ నిర్మాణం, కొనసాగింపుపై గ్రహణం పట్టుకుందని చెప్పవచ్చు.

దహన సంస్కారాలను అడ్డుకున్న పోలీసులు

● కుటుంబీకులు, పోలీసులకు మధ్య వాగ్వాదం
● పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియలు



శేఖర్ (ఫైల్)

చిన్నకోడూరు, మే 17: యువకుడి దహనసంస్కారాలను అడ్డుకోవడంతో పోలీసులకు, కుటుంబీకులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. ఈ సంఘటన శుక్రవారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చంద్లాపూర్‌లో జరిగింది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. చంద్లాపూర్‌కు చెందిన వల్లెపు యాదవ్వ, మల్లయ్య దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు శేఖర్(24) ఉన్నారు. శేఖర్ ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నాడు. ప్రస్తుతం కూలీ పనులు చేసుకుంటూ తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటున్నాడు. ఈనెల 11న మధ్యాహ్నం శేఖర్‌కు తన చెల్లె ఫోన్ చేసి అమ్మానాన్నకు గొడవైందని చెప్పింది. ఆవేశంగా ఇంటికి వెళ్లిన శేఖర్ తన తండ్రిపై చేయిచేసుకున్నాడు. ఆ తర్వాత తండ్రి తప్పులేదని తెలుసుకున్న శేఖర్ మనస్థాపంతో అదే రోజు రాత్రి గ్రామశివారులోని ఓపెన్ జిమ్ వద్ద పురుగుల మందు తాగాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న కుటుంబీకులు శేఖర్‌ను సిద్దిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శేఖర్ గురువారం అర్ధరాత్రి పరిస్థితి విషమించి మృతిచెందాడు. కుటుంబీకులు శుక్రవారం ఉదయం అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. శవయాత్ర నిర్వహించి చితి మీద మృతదేహాన్ని పెట్టే ఆఖరి క్షణంలో పోలీసులు దహన సంస్కారాలను అడ్డుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించేందుకు పోలీసులు ప్రయత్నించగా.. కుటుంబీకులు, బంధువులు, గ్రామస్థులు అడ్డుకుని వారితో వాగ్వాదానికి దిగారు. ఆత్మహత్యకు పాల్పడితే నిబంధనల ప్రకారం పోస్టుమార్టం చేయాలని పోలీసులు నచ్చజెప్పడంతో చివరికి ఒప్పుకున్నారు. ఓ ప్రైవేటు వాహనంలో యువకుడి మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించడంతో చంద్లాపూర్‌లో దహన సంస్కారాలు నిర్వహించారు. మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి చెరువులో గల్లంతు

శివ్వంపేట, మే 17: చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి చెరువులో గల్లంతైన సంఘటన సంఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గంగాయిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని బోజ్యాతండా పంచాయతీ హరిదాసు తండాకు చెందిన బానోత్ శంకర్(35), మూడవత్ రామచందర్ ఇద్దరు కలిసి గురువారం సాయంత్రం గంగాయపల్లిలోని ఉడుగుల చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లారు. చేపలు పడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు శంకర్ చెరువులో మునిగాడు. రామచందర్ ఇదంతా గమనించి, అక్కడి నుంచి వెళ్లిపోయాడు. శుక్రవారం మృతుడి భార్య రామచందర్‌ను తన భర్త విషయమై అడుగగా తాను తీసుకొస్తానని చెప్పి పరారయ్యాడు. స్థానికులు చెరువు కట్టపైన శంకర్ దుస్తులు కనిపించడంతో కుటుంబీకులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది, గజ ఈతగాళ్లు చెరువులో గాలించినా మృతదేహం లభ్యం కాలేదు.

చకచకా..


● చురుగ్గా నల్లవాగు ప్రాజెక్టు కాలువల ఆధునీకరణ
● సిమెంట్ లైనింగ్‌తో 3-4 టీఎంసీల నీరు ఆదా
● 13 గ్రామాలకు ప్రయోజనం
● చివరి ఆయకట్టుకు మహర్దశ



కల్హేర్ మండలంలోని జంలాతండా సమీపంలో లైనింగ్ పనులు పూర్తయిన కుడి కాలువ

కల్హేర్, మే 17: సంగారెడ్డి జిల్లా కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లోని 13 గ్రామాలకు చెందిన ఆయకట్టుతో పాటు కామారెడ్డి జిల్లాలోని రెండు గ్రామాలకు ఎంతో జీవనాధారమైన నల్లవాగు ప్రాజెక్టు కాలువల ఆధునీకరణ పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. 2018లో ప్రారంభమైన పనులు అర్థాంతరంగా నిలిచిపోగా, నారాయణఖేడ్ నూతన ఎమ్మెల్యేగా ఎన్నికైన పి.సంజీవరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని తిరిగి ప్రారంభింపజేయడంతో ఈ పనులను యుద్ధప్రాతిపదికన కొనసాగిస్తున్నారు. సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు ప్రాజెక్టు కింద పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగు నీరు అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఈ పనులు బిల్లులు అందకపోవడానికి తోడు, సబ్ కాంట్రాక్టరుచే పనులు చేయించడంతో సకాలంలో పూర్తి కాలేదు. మంజూరైన నిధుల్లో నుంచి కేవలం 30 శాతం పనులే పూర్తి కాగా మిగతా పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. నారాయణఖేడ్ ఎమ్మెల్యేగా గత సంవత్సరం డిసెంబరులో ఎన్నికైన సంజీవరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని కాలువల ఆధునీకరణ పనులు కాంట్రాక్టు పొందిన బిఎస్‌బి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇండియా లిమిటెడ్ యాజమాన్యంతో మాట్లాడి పనులు త్వరగా పూర్తి చేయాలని, ప్రభుత్వంతో బిల్లులు ఇప్పించే బాధ్యత తనదని హామీ ఇవ్వడంతో జనవరి నెలలో పనులు ప్రారంభించారు. నల్లవాగు ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ఆధునీకరణ పనుల కోసం గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి రూ.24.54 కోట్లను మంజూరు చేయించగా 2018లో ఈ పనులకు అప్పటి తెలంగాణా రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. పనుల నిర్వహణ కోసం 2019, 2020లో క్రాప్‌హాలిడే ప్రకటించినా పనులు పూర్తి చేయలేదు. మంజూరైన పనుల్లో కేవలం 30 శాతం మాత్రమే చేపట్టగా ఈ పనులతో సాగు నీటి సరఫరా సక్రమంగా జరిగే అవకాశం లేకపోవడంతో ఆయకట్టు రైతులు విషయాన్ని ఎమ్మెల్యే సంజీవరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి నల్లవాగు రైతుల భూములకు సాగు నీరు అందించేందుకు చర్యలు తీసుకున్నారు.

చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించడమే లక్ష్యం



నల్లవాగు ప్రాజెక్టు ప్రతి వర్షాకాలంలో రెండు, మూడు దఫాలుగా పొంగి ప్రవహిస్తున్నది. 3, 4 టీఎంసీల వరద నీరు వృథాగా దిగువన ఉన్న మంజీరా నదిలో కలుస్తున్నది. దీంతో ప్రాజెక్టు పూర్తి ఆయకట్టుకు సాగు నీరు అందించలేకపోతున్నాం. ఇక ముందు అలా జరుగకుండా ఉండాలని చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించేందుకు పనులు చేపడుతున్నాం. నిలిచిపోయిన పనుల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తిరిగి ప్రారంభమయ్యేలా చేశాను. ప్రస్తుతం ఉన్న నిధుల మేరకు కుడి కాలువ 14 కిలోమీటర్ల మేరకు లైనింగ్, గైడ్ వాల్ పనులు జరుగుతాయని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. మిగిలిన 5 కిలోమీటర్ల వరకు కూడా పనులు పూర్తి అయ్యేలా చూస్తాను.

- పి.సంజీవరెడ్డి, ఎమ్మెల్యే, నారాయణఖేడ్

సాగు నీటి బాధలు తీరినట్టే



నల్లవాగు ప్రాజెక్టు కుడి కాలువ లైనింగ్, గైడ్ వాల్ పనులు పూర్తయితే మాకు సాగు నీటి బాధలు తీరినట్లే. పకడ్బందీగా నిర్వహిస్తున్న పనులతో ఆయకట్టు రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. కాలువల పనులను తిరిగి కొనసాగేలా చేసిన ఎమ్మెల్యేకు, అధికారులకు రైతుల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

- దేవసోత్ గోవింద్ నాయక్, రైతు, జంలాతండా

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు శాపం

● దండుపల్లి కొనుగోలు కేంద్రం వద్ద బీఆర్ఎస్ ధర్నా



దండుపల్లిలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మనోహరాబాద్, మే 17: కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పాలిట శాపంగా మారిందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం మనోహరాబాద్ మండలం దండుపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం వద్ద ఆయన బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎలక్షన్‌లో ఓట్ల కోసం సాధ్యంకాని హామీలు ఇచ్చి, ప్రస్తుతం పూటకో మాట మారుస్తుందని దుయ్యబట్టారు. రైతులకు క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని చెప్పి మొండిచేయి చూపారన్నారు. రైతులకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి చేయకపోవడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. కేవలం సన్నవడ్లకు మాత్రమే ఇస్తాం, దొడ్డు వడ్లకు ఇవ్వం అని చెప్పడం కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానితనానికి నిదర్శనమన్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ హయాంలో రైతులకు ఎక్కడ ఇబ్బంది కాకుండా లక్షల టన్నుల ధాన్యం సేకరించామని గుర్తు చేశారు. అయితే ఇప్పటి వరకు మండలంలో ఎక్కడి ధాన్యం అక్కడే రోజూ వర్షాలకు తడిసిపోతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం రైతుల ఉసురు పోసుకోవడమేనని మండిపడ్డారు. మండలంలో ఉన్నా 6 కేంద్రాల వద్ద బస్తాలు నింపి వర్షానికి తడుస్తున్న ఇటు అధికారులు కానీ, అటు ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకున్న పాపాన పోలేదనీ అసంతృప్తి వ్యక్తం చేసారు. మూడు రోజుల క్రితం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల పడిగాపులు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన తహసీల్దార్ మరుసటి రోజు దండుపల్లి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మండలంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేవు లారీల కొరత మాత్రమే ఉన్నదని, పత్రికల్లో వచ్చిన వార్త అవాస్తవమని జిల్లా ఉన్నతాధికారులకు వివరణ ఇచ్చారు. అయితే శుక్రవారం దండుపల్లి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన బీఆర్ఎస్‌పార్టీ నాయకులు మాట్లాడుతూ.. రైతులను ఇబ్బంది పడుతున్నా, అధికారులు మాత్రం కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి సమస్యలు లేవని చెప్పడం సిగ్గుచేటని విమర్శించారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయండి

● అకాల వర్షాలతో తడిసి ముద్దవుతున్న ధాన్యం
● తూకం వేసిన ధాన్యం బస్తాలు ఎక్కడివక్కడే
● తరలించడంలో అధికారుల నిర్లక్ష్యం
● ధాన్యం రాశుల వద్దే రైతుల పడిగాపులు



కొల్చారం: కోనాపూర్‌లో ధాన్యం అడుగు భాగంలో మొలకలను చూపిస్తున్న రైతులు

కొల్చారం, మే 17: రెండు రోజులుగా అకాల వర్షాలతో మండలంలోని పలు గ్రామాల్లో వరిధాన్యం తడిసిముద్దయింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా తూకం వేసిన బస్తాలు తరలించడంలో జాప్యంతో తడిసిపోయాయి. తడిసిన బస్తాలను ఆరబెడుతున్నారు. కల్లాల వద్ద ఉన్న ధాన్యం రాశులు ఎక్కడికక్కడ తడిసిపోగా, కింది భాగంలో ధాన్యం మొలకలు రావడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కొల్చారం మండలం కోనాపూర్‌లో పదిహేను రోజుల క్రితం నుంచే వరిధాన్యాన్ని తూకం వేయడం ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కేవలం రెండు లారీలు మాత్రమే ధాన్యం రైస్‌మిల్లుకు తరలించారు. అందులో రైలస్‌మిల్లర్ ఒక్క లారీ లోడ్‌ను ఖాళీ చేసుకుని, మరో లారీ లోడ్‌లో తేమశాతం ఎక్కువగా ఉందని, రైతు వచ్చి తరుగువిషయమై మాట్లాడుకోవాలని కబురు పంపారు. మిగతా రైతులు వరికోత కోస్తుండడంతోనే ధాన్యాన్ని పంటచేలల్లో ఆరబెడుతున్నారు. రెండు రోజులుగా కురిసిన వర్షంతో ధాన్యం రాశుల కిందకి నీరు చేరి తడిసిముద్దయింది. కొన్ని చోట్ల వరిధాన్యం మొలకలు రావడంతో ధాన్యాన్ని మరో చోటికి తరలిస్తున్నారు. లారీలు సకాలంలో రాకపోవడంతోనే తూకం వేసిన బస్తాలు ఎక్కడికక్కడ తడుస్తున్నాయని రైతులు వాపోతున్నారు. కాగా అకాల వర్షానికి ధాన్యం తడిసి ముద్దవడంతో పాటు మొలకలు వచ్చిన వరిధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోనాపూర్ రైతులు కోరుతున్నారు. మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురి చేయడం మానుకోవాలని, సన్నరకం వరిధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేసి ఎక్కువ ధర చెల్లించాలని కోరుతున్నారు.



శివ్వంపేట: తడిసిన ధాన్యాన్ని చూపుతున్న మహిళారైతు

శివ్వంపేట మండలంలో...

శివ్వంపేట, మే 17: శివ్వంపేట మండల వ్యాప్తంగా గురువారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కారణంగా కొనుగోలు కేంద్రాల దగ్గర, కల్లాల్లో, రోడ్లమీద ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. ధాన్యాన్ని రక్షించుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడ్డారు. ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దవడంతో పలు గ్రామాల్లో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని పెద్ద గొట్టిముక్కుల గ్రామంలో కల్పగూరి బాలమణి మహిళా రైతుకు చెందిన ధాన్యం రోడ్డుపైన ఆరపోయడంతో తడిసిపోయింది. ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం అకాల వర్షానికి తడిసిపోవడంతో ప్రభుత్వమే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని రైతు బాలమని కోరుతుంది.

తడిసిన ధాన్యంపై అభ్యంతరాలు సరికాదు

మాసాయిపేట, మే 17: మండలంలోని వివిధ గ్రామాల్లో కురుస్తున్న అకాల వర్షాలకు తడిసిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు డిమాండ్ చేస్తున్నారు. కొనుగోలు సెంటర్ల వద్ద అధికారులు తడిసిన ధాన్యాన్ని తీసుకునేందుకు అభ్యంతరాలు చెబుతున్నారని వాపోయారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

రైతులు అధైర్యపడొద్దు... ప్రభుత్వం అండగా ఉంది

డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్



రెడ్డిపల్లిలోని కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు

నర్సాపూర్, మే 17: రైతులు ఎవరూ అధైర్య పడొద్దని రైతులకు రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉందని మెదక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్. ఆంజనేయులు గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపూర్ మండలంలో పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం వల్ల తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ప్రతిపక్షాలు కేవలం తమ రాజకీయ లబ్ధి కోసం రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. పదేళ్లపాటు ప్రభుత్వంలో ఉండి కూడా రైతులను పట్టించుకోని బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు రాజకీయం చేస్తున్నారన్నారు. డీసీసీ అధ్యక్షుడి వెంట మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ గుప్తా, మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశం, యూత్ నాయకుడు శివప్రసాద్‌గౌడ్, మన్నె శ్రీనివాస్, నర్సింహాచారి, వెంకటేశ్, మహేష్ ఉన్నారు.

రుద్రారంలో ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం

నారాయణఖేడ్, మే 17: మండలంలోని రుద్రారంలో శని, ఆదివారాల్లో ఎల్లమ్మతల్లి ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు గ్రామస్థులు శుక్రవారం తెలిపారు. వార్షికోత్సవంలో భాగంగా శనివారం పుణ్యాహవచనం, మహాగణపతి పూజ, నవగ్రహ మండపారాధన, ఆవాహిత దేవతారాధన, ఎల్లమ్మతల్లికి హోమం, 108 కలశాలతో అష్టోత్తర ఘటాభిషేకం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, మహామంగళ హారతి, మంత్రపుష్పం, రాజోపచారసేవ, తీర్థ ప్రసాదాల వితరణ, ఆదివారం రేణుక ఎల్లమ్మ, జమదగ్ని మహర్షి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు కన్యకా పరమేశ్వరి జయంతి



ఆలయంలో ముస్తాబైన అమ్మవారు

జహీరాబాద్, మే 17: ఈ నెల 18న కన్యకాపరమేశ్వరీ జయంతిని పురస్కరించుకుని జహీరాబాద్ పట్టణంలోని రాచన్నపేటలో ఉత్సవాలను నిర్వహించనున్నట్టు ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి అభిషేకం, సామూహిక కుంకుమార్చన, లలిత సహస్రనామ పారాయణం, డోలారోహణం, మహా హారతి, శోభాయాత్ర, నృత్యప్రదర్శనలు, దాండియా తదితర కార్యక్రమాలు ఉంటాయని వారు తెలిపారు. శనివారం నిర్వహించే ఉత్సవాల్లో అందరూ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ తెలిపింది.

దొడ్డు వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలి: జడ్పీటీసీ



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ రమేష్‌గౌడ్

వెల్దుర్తి, మే 17: రైతులు పండించిన దొడ్డు రకం వడ్లకు రూ. 500 బోనస్ ఇవ్వాలని జడ్పీటీసీ రమేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం వెల్దుర్తిలోని ఆయన ఛాంబర్‌లో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, మెదక్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కృష్ణగౌడ్‌లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. లోకసభ ఎన్నికలు ముగియగానే కేవలం సన్నవడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని చెప్పడం సరికాదని ధ్వజమెత్తారు. ఇటీవల కురిసిన వర్షాలకు దాన్యం కొనుగోలు కేంద్రాల్లో పూర్తిగా తడిసిపోయిందని, ప్రభుత్వం వెంటనే తడిసిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఏనాడూ విత్తనాలు, ఎరువుల కోసం క్యూలైన్‌లో నిలబడలేదని, ప్రసుత్త ప్రభుత్వంలో జీలుగ విత్తనాల కోసం రైతులు లైన్‌లో నిలబడే పరిస్థితి వచ్చిందన్నారు. సమావేశంలో నాయకులు అశోక్‌గౌడ్, గంగధార్ తదితరులు పాల్గొన్నారు.

నెల రోజులుగా రాగి జావ వితరణ



సంగారెడ్డిలో అంబలి వితరణ చేస్తున్న సేవాసమితి సభ్యులు

సంగారెడ్డి రూరల్, మే 17: ప్రజల దాహార్తిని తీర్చేందుకు అంబలి కేంద్రం ఏర్పాటు చేసి గత నెల రోజులుగా రాగిజావ పంపిణీ చేస్తున్నామని అయ్యప్ప ఆపద్బాంధవ సేవాసమితి అధ్యక్షుడు సత్యనారాయణ తెలిపారు. సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్ ముందు ఏర్పాటు చేసిన అంబలి కేంద్రం ద్వారా శుక్రవారం ప్రజలకు అంబలిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ 1500 మందికి అంబలి పంపిణీ చేస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు శ్రీశైలం గురుస్వామి, కవిత, సత్యం, మాణిక్‌రెడ్డి, నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్‌లో విలీనంతో మున్సిపాలిటీ మరింత అభివృద్ధి

జిన్నారం, మే 17: గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్‌లో విలీనంతో బొల్లారం మున్సిపాలిటీ మరింతగా అభివృద్ధి చెందుతుందని కాంగ్రెస్ మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బొల్లారంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ శివారు ప్రాంతాల మున్సిపాలిటీలను విలీనం చేసి గ్రేటర్ కార్పొరేషన్ ఏర్పాటు చేయనున్నందున, ఇందులో బొల్లారం మున్సిపల్ కూడా విలీనం జరుగుతుందని వెల్లడించారు. అభివృద్ధికి దూరంగా ఉన్న బొల్లారంను గ్రేటర్‌లో కలిపితే మరింతగా అభివృద్ధి జరుగుతుందని, విలీనాన్ని తాము స్వాగతిస్తున్నామని వారు అన్నారు.

బీబీపాటిల్ గెలుపు ఖాయం: కోణం విఠల్



బీజేపీ కార్యాలయంలో మాట్లాడుతున్న కోణం విఠల్

పెద్దశంకరంపేట, మే 17: జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్ విజయం ఖాయమని పెద్దశంకరంపేట మండల బీజేపీ అధ్యక్షుడు కోణం విఠల్ పేర్కొన్నారు. శుక్రవారం పెద్దశంకరంపేటలోని భారతీయజనతా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో ప్రధానమంత్రి మోదీ ఆధ్వర్యంలో బీజేపీ మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు కానున్నదని తెలిపారు. దేశవ్యాప్తంగా బీజేపీకి మంచి ఆదరణ లభిస్తున్నదన్నారు. బీబీపాటిల్ గెలుపు కోసం కృషి చేసిన బీజేపీ కార్యకర్తలు నాయకులు అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో నాయకులు ఎంపీటీసీ దామోదర్, మాజీ సర్పంచులు సూర్యప్రకాష్, అశోక్, శ్రావణ్‌కుమార్, మంగళకృష్ణ, ఎర్ర శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మనోహరాబాద్‌లో ప్రపంచ రక్తపోటు దినోత్సవం



మనోహరాబాద్ పీహెచ్‌సీలో నిర్వహించిన వేడుకల్లో వైద్య సిబ్బంది

మనోహరాబాద్, మే 17: మనోహరాబాద్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారి వికాస్ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తపోటు దినోత్సవం నిర్వహించారు. మనోహరాబాద్ మండలకేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ర్యాలీ నిర్వహించి రోగులకు, వృద్ధులకు రక్తపోటుపై అవగాహన కల్పించారు. ర్యాలీలో వైద్యులతో పాటు వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

మామిడ్యాలలో బొడ్రాయికి భూమి పూజ

ములుగు, మే 17: గ్రామాల అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా ముందుకురావాలని వంటిమామిడి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోదూరు భూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మామిడ్యాలలో శుక్రవారం బొడ్రాయి ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొండపోచమ్మ భూములు కోల్పోయిన గ్రామాల్లోని గ్రామస్థులు భూములతో పాటు సర్వం త్యాగం చేశారన్నారు.

ప్రముఖ ప్రవచనకారుడు లక్ష్మణరావు మృతి



నారాయణఖేడ్, మే 17: నారాయణఖేడ్‌లో నివాసముంటున్న ప్రముఖ ప్రవచనకారుడు లక్ష్మణరావు(75) శుక్రవారం గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన మనూరు మండలం కమలాపూర్ గ్రామానికి చెందినవారు. హరిభక్త పారాయణం చేసే లక్ష్మణరావు కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శుక్రవారం పరిస్థితి విషమించి గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఆయన అఖండ హరినామ సప్తాహ కార్యక్రమాలతో పాటు మరాఠా సంప్రదాయ వార్కారి, భజన, కీర్తన, ప్రవచనాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకునేవి. ఆయన మృతిపట్ల భక్తులు సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం ఖేడ్‌లో అంత్యక్రియలు నిర్వహించారు.

సమీకృత మార్కెట్ స్లాబ్ లీక్

గజ్వేల్, మే 17: సమీకృత మార్కెట్‌లో స్లాబ్ లీకవుతున్నది. ఎంతో ఆర్బాటంగా నిర్మించిన సమీకృత మార్కెట్‌లో ఇటీవల కురిసిన చిన్న వర్షానికే లీకేజీలు బట్టబయలయ్యాయి. వర్షం పడిన సమయంలో సమీకృత మార్కెట్‌లో నడవాలంటే ఇబ్బందిగా మారింది. ఎక్కడ కాలు జారుతుందోనని క్రయ, విక్రయదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

● ఎంపీపీ చందనాప్రశాంత్ రెడ్డి



పాపన్నపేట సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

పాపన్నపేట, మే 17: ప్రత్యేకాధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ చందనారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్నపేటలో పలు వార్డుల్లో మిషన్ భగీరథ నీరు సక్రమంగా రావడం లేదని ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్ సభ దృష్టికి తీసుకువచ్చారు. పలు గ్రామాల్లో విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తగిలి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నదని సభకు విన్నవించారు. ఉపాధి హామీ డబ్బులు సక్రమంగా రావడం లేదని సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరుగుతుందని, లారీలు సరిగా రావడం లేదని, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఎంపీటీసీలు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను సభలో చదివి వినిపించారు. సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా పాలించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని వివరించారు. పార్టీలకతీతంగా మండలాభివృద్ధికి కృషి చేశామని తెలిపారు. ఎంపీపీగా ఇది చివరి సమావేశమని, ఇంతకాలం సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. డీఎల్పీవో సతీష్‌కుమార్, ఎంపీడీవో సుబ్రమణ్యం, వైస్ ఎంపీపీ విష్ణువర్ధన్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు గౌస్, ఎంపీటీసీలు రమేష్‌గౌడ్, సరస్వతి, ప్రత్యేకాధికారులు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

ఇక పనులపై దృష్టి సారించాలి: కమిషనర్



సిబ్బందికి సూచనలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్

జహీరాబాద్, మే 17: ఇప్పటివరకు పార్లమెంట్ ఎన్నికల విధుల్లో నిమగ్నమైన మున్సిపల్ సిబ్బంది ఇక నుంచి వారికి కేటాయించిన విధులపై దృష్టి సారించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో తన చాంబర్‌లో సిబ్బందితో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటివరకు ఎన్నికల విధి నిర్వహణలో బిజీగా ఉన్న సిబ్బంది ఇకపై వారికి కేటాయించిన పనులను సజావుగా చేపట్టాలన్నారు. పలువురు సిబ్బందిని వివిధ విభాగాలకు కేటాయిస్తూ బాధ్యతలను అప్పగించారు. కొత్తగా నిర్మించిన ఇళ్లను గుర్తించి వాటికి ఇంటినెంబర్లను కేటాయించాలని, దీంతో మున్సిపాలిటీకి మరింత ఆదాయం పెరుగనుందన్నారు. అలాగే పట్టణంలో అనుమతులు లేని నిర్మాణాలపై మున్సిపల్ సిబ్బంది దృష్టి పెట్టి, తమ దృష్టికి తీసుకువస్తే చట్టపరంగా చర్యలు చేపడదామన్నారు. వార్డుల్లో ఎక్కడైన నీటిసమస్య, బోర్లు, నల్లాల మరమ్మతులు, ఆస్తిపన్ను వసూళ్లు తదితర అంశాలపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. జహీరాబాద్ పట్టణాభివృద్ధిలో అందరం భాగస్వాములై ప్రజల, నాయకుల సహకారంతో అభివృద్ధి చేసుకుందామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి నరేష్, మున్సిపల్ ఏఈ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

కర్నాల్‌పల్లి పాఠశాలలో మరమ్మతు పనుల పరిశీలన



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న అధికారులు

చేగుంట, మే 17: మండల పరిధిలోని కర్నాల్‌పల్లి, ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న మరమ్మతు పనులను సంబంధిత శాఖ ఏఈ మమత శుక్రవారం సందర్శించి పనులను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కోసం ఏర్పాటు చేస్తున్న సంపు నిర్మాణ పనులు నాణ్యత తో చేపట్టాలని ఆమె సూచించారు. పాఠశాలలో మరుగుదొడ్లు, తరగతి గదులు, తలుపులు, కిటికీలు, పాఠశాలకు అవసరమైన మరమ్మతు పనులు చేయించాలని ఆమె సూచించారు. పాఠశాలలో పూర్తయిన ఓవర్‌హెడ్ ట్యాంక్, విద్యుత్ తదితర పనులను పరిశీలించారు. ఆమె వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ కన్వీనర్ చిట్టబోయిన సత్యనారాయణ, చైర్మన్ బి.మాధవి, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సీఏ సరిత, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

నర్సాపూర్, మే 17: గిరిజన జూనియర్ కళాశాలలో ఇంటర్ స్పాట్ అడ్మిషన్ల కోసం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ సంపత్‌కుమార్ శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 23న కామారెడ్డి పట్టణంలోని నాగిరెడ్డిపేట గిరిజన గురుకులంలో బాలురకు, మెదక్ జిల్లా చేగుంటలోని జూనియర్ కళాశాలలో 25వ తేదీన బాలికలకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు చెందిన 2023-24 విద్యాసంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసిన ఎస్టీ విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. ఆసక్తిగల గిరిజన బాల, బాలికలు మెమో, బోనాఫైడ్, టీసీ, కుల, ఆదాయ, ఫిజికల్ ఫిట్‌నెస్ తదితర ధ్రువపత్రాలు తీసుకుని కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు. మెదక్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న ఎంపీసీ, బీపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఒకేషన్‌లో ప్రథమ సంవత్సరంలో మిగిలిన ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

రైతులకు త్వరలోనే పచ్చిరొట్ట విత్తనాలు



ఝాన్సీ, ఏవో

వెల్దుర్తి, మే 17: వానాకాలం సాగుకు కావాల్సిన పచ్చిరొట్ట విత్తనాలు త్వరలోనే రైతులకు అందుబాటులోకి రానున్నట్టు మండల వ్యవసాయ అధికారి ఝాన్సీ శుక్రవారం తెలిపారు. మండల వ్యవసాయ విస్తీర్ణం మేరకు 60 క్వింటాళ్ల జనుము, 260 క్వింటాళ్ల జీలుగ రాయితీ విత్తనాల కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపించామని, ఇప్పటివరకు 450 బస్తాలు మాత్రమే వచ్చిందని, మరో రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో పచ్చిరొట్ట విత్తనాలు వస్తాయన్నారు. వెల్దుర్తి, రైతుఆగ్రోస్ కేంద్రంలో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉంటాయని, అవసరమైన రైతులు కొనుగోలు చేయాలని తెలిపారు.

రఘునందన్‌రావుకు భారీ మెజారిటీ ఖాయం



మాట్లాడుతున్న బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

మెదక్, మే17: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు భారీ మెజార్టీతో గెలుపు ఖాయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం మెదక్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెదక్ పార్లమెంట్‌లోని ఏడు నియోజకవర్గాల్లో భారీ మెజార్టీ రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కష్టపడి పనిచేసిన ప్రతీ కార్యకర్తకు, నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు ఎంఎల్ఎన్‌రెడ్డి, శ్రీనివాస్, కిసాన్‌మోర్చా అధ్యక్షుడు సత్యనారాయణ, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాశీనాథ్, సీనియర్ నాయకులు వెల్మల సిద్ధిరాములు, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షులు ప్రసాద్, ప్రభాకర్, రాములు, రాజు, భాను, రంజిత్‌రెడ్డి, చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలు మరింత అందుబాటులోకి..

● జిన్నారంలో 1.56 కోట్లతో కొత్త పీహెచ్‌సీ పనులు పూర్తి
● మండలంలో మరో మూడు బస్తీ దవాఖానాలు
● కాజీపల్లిలో ప్రారంభమైన ఆరోగ్య కేంద్రం



జిన్నారంలో పనులు పూర్తయిన ఆరోగ్య కేంద్రం

జిన్నారం, మే 17: మండలంలోని పలు గ్రామాలు, పారిశ్రామిక ప్రాంతల ప్రజలకు వైద్య సేవలు మరింతగా అందుబాటులోకి వచ్చాయి. మండలం కేంద్రంలో నూతన వైద్యసేవల భవనం పనులు పూర్తి కాగా.. మరో 2 చోట్ల నూతన బస్తీ దవాఖానాల(సబ్‌సెంటర్ల) ఏర్పాటు పనులు పూర్తయ్యాయి. మరోచోట పనులు చేపట్టాల్సి ఉన్నది. ఇక ఇటీవలే కాజీపల్లిలో నూతన ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిన్నారంలో నూతన ఆరోగ్య కేంద్రం పనులు పూర్తి

జిన్నారం మండల కేంద్రంలో గత 30 ఏళ్ల నుంచి కొనసాగుతున్న ప్రధాన భవనం శిథిలావస్థకు చేరగా కొత్త ఆరోగ్య కేంద్ర భవనం నిర్మాణానికి రూ.1.56 కోట్ల నిధులు మంజూరవడంతో పనులు పూర్తయ్యాయి. మండలంలో కొత్తగా మరో మూడు చోట్ల బస్తీ దవాఖానాలు(సబ్‌సెంటర్)ల మంజూరు కాగా రెండు చోట్ల పనులు చివరి దశలో ఉన్నాయి. శివానగర్‌లో బస్తీ దవాఖానా పనులు పూర్తి కాగా, నల్తూరులో చివరి దశలో ఉన్నాయి. ఇక జిన్నారంలో పనులు ప్రారంభం కావాల్సి ఉంది. ఒక్కో సబ్‌సెంటర్‌ను రూ.20 లక్షల చొప్పున నిధులతో చేపట్టారు. ఇటీవలే పారిశ్రామికవాడ కాజీపల్లిలో నూతన ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు ప్రారంభమయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో సత్వర వైద్య సేవల కోసం సబ్ సెంటర్ల ఏర్పాటుతో ఆయా ప్రాంతాల ప్రజలకు ప్రాథమిక వైద్య సదుపాయాలు మరింతగా అందుబాటులోకి రానున్నాయి. మరో పారిశ్రామిక వాడ గడ్డపోతరంలో సబ్‌సెంటర్ ఏర్పాటు చేయాల్సి ఉన్నది. ఇక్కడ 10 వేల జనాభా ఉన్నప్పటికీ ప్రాథమిక వైద్య సేవలు అందడం లేదు. అదే విదంగా గడ్డపోతారం, వావిలాల, లక్ష్మీపతిగూడెం పంచాయతీల వైద్య సేవల పరిధి గుమ్మడిదల మండలంలో ఉండటం స్థానికులకు ఇబ్బందిగా మారింది. గత పదేళ్లుగా ఈ మూడు గ్రామాల పంచాయతీల ప్రజలు తమ వైద్య సేవల పరిధిని సమీపంలోని జిన్నారం పీహెచ్‌సీ పరిధికి మార్చాలని డిమాండ్ చేస్తున్నా నేటికీ అమలు కాలేదు. ఈ మూడు ప్రాంతాలు సమీప వైద్యకేంద్రం పరిధిలోకి చేరితే అన్ని ఆరోగ్య కేంద్రాలు జనవాసాలకు సమీపంలో ఉండి వైద్య సేవలు మరింతగా అందుబాటులోకి రానున్నాయి.

వైద్య సేవలకు ప్రాధాన్యం: ఎంపీపీ రవీందర్‌గౌడ్

జిన్నారం మండలంలో అన్ని ప్రాంతాలకు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ పరంగా కృషి చేస్తున్నాం. మండలంలో చేపట్టిన 3 సబ్ సెంటర్లకు గాను రెండు చోట్ల పనులు పూర్తి అయ్యాయి. మరోచోట పనులు ప్రారంభం కావాల్సిఉంది. జిన్నారంలో 1.56 కోట్లతో చేపట్టిన నూతన భవనం పనులు పూర్తయ్యాయి.